
# విల్లంబు పట్టిన గిరిజనుడు

**శతాబ్దాలపాటు దాస్యంలో గడిపిన గిరిజనుడు తిరగబడుతున్నాడు. గిరిజనేతరులు ఆక్రమించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోడానికి, హక్కులను కాపాడుకోడానికి విల్లంబు పట్టి ఉద్యమిస్తున్నాడు.**

పశ్చిమగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం భూవివాదాల కొలిమిలా, బ్లోఅవుట్‌లా భగ్గుమంటోంది. ఈ జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరంలోని 102 గ్రామాల్లో ఉద్రిక్తత చోటు చేసుకొంది. కొన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో వుంది. ఏజన్సీ భూములపై గిరిజనేతరుల పెత్తనాన్ని సవాల్ చేస్తూ, అలాంటి భూములన్నింటినీ స్వాధీనం చేసుకునేందుకు గిరిజనులు నడుం కట్టారు. ప్రతి గిరిజనుడూ



అనాటి ధనుర్వేదం ఈనాటి ఉదరపోషణార్థం. కొండరెడ్డి యువకుడు పక్షులను వేటాడడానికి ఉపయోగిస్తున్న బాణం

ఏకలవ్యుడై విల్లంబులు చేతబట్టాడు. ఏజన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు పండించిన పంటలను స్వాధీనపరచుకోవడం, వరికుప్పలను నూర్చుకుని ధాన్యాన్ని అమ్ముకోవడం, వందలాది ఎకరాల ఎస్టేటు భూముల్లో ఎర్రజెండాలు పాతి ఆక్రమించుకోవడంలో గిరిజనులు నిమగ్నమయ్యారు. పోలీసులు అడ్డొస్తే విల్లంబులతో చుట్టుముట్టి నిర్బంధించడానికి సైతం అడవిపుత్రులు వెనకాడడం లేదు. తమ పట్టా భూములను సైతం గిరిజనులు ఆక్రమించుకుని తమను పొలాల్లోకి రానీయడం లేదంటూ అగ్రవర్ణ గిరిజనేతరులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. పోలీసులు గిరిజనులపై అక్రమ కేసులు బనాయిస్తూ వందలాది గిరిజనులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతున్నారు. గిరిజన మహిళలను సైతం పోలీసులు వేధిస్తున్నారు అయినప్పటికీ గిరిజనులు మనోస్థైర్యం వీడకుండా ప్రాణం పోయే దాకా పోరాడతాం అంటూ ఉద్యమాన్ని ముందుకు నడుపుతున్నారు. పలు విప్లవసంఘాలు, ముఖ్యంగా 'శక్తి' స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన స్ఫూర్తితో వారు అడవిదివిటీల్లా పోరాడుతూ జిల్లా రెవెన్యూ, పోలీసు అధికారులను సైతం బెంబేలెత్తిస్తున్నారు. ఏజన్సీ అంటే గిరిజనులు నివసించే ప్రాంతం. ఇక్కడి భూములన్నింటినీ సాగుచేసుకునే హక్కు గిరిజనులమైన మాకే వుంది. అలాంటపుడు మన్యంలో వందలాది ఎకరాలు అగ్రవర్ణ గిరిజనేతరులకు ఎలా వచ్చాయి" అని పోలవరం మండలం, వెంకటరెడ్డిగూడెం గ్రామానికి చెందిన భూలక్ష్మి ప్రశ్నించారు. ఈమె భూవివాదాల్లో చురుకుగా పాల్గొనడమే గాకుండా గిరిజన చైతన్య సంఘాన్ని కూడా నడుపుతున్నారు. "గిరిజనేతరులు చూపించే పత్రాలు, పట్టాలు అన్నీ బోగస్. పాలకులు గిరిజనేతరులు కాబట్టి అలాంటి డూప్లికేట్ హక్కు పట్టాలను ఎన్నయినా సృష్టించవచ్చు" అని ఆమె అన్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో షెడ్యూలు గిరిజన ప్రాంతమైన పోలవరం, జీలుగుమిల్లి, బుట్టాయ గూడెం మండలాలలో నిర్వహిస్తున్న భూసర్వేను నిలిపివేయాలని 3-5-97న హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా పోలీసు అధికారులను బదిలీ చేయాలని, రెండు నెలలుగా ఖాళీగా వున్న జిల్లా కలెక్టరు పోస్టును వెంటనే భర్తీ చేయాలని అదే ఉత్తర్వులో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ల్యాండు సర్వేలో భాగంగా గిరిజన మండలాల లోని భూముల్ని 1. గయ్యాళు భూములు 2. పోరంబోకులు 3. ఎల్.టి.ఆర్. భూములు 4. లాండు సీలింగ్ భూములు 5. గిరిజనేతరులు అనుభవిస్తున్న గిరిజనభూములు గా విభజిస్తూ సర్వే జరుగుతోంది. ఈ సర్వేలో 60 శాతం పని పూర్తి అయ్యింది. మిగిలినది ఒక నెల రోజులలో పూర్తి అవుతుంది అని కొవ్వూరు ఆర్.డి.ఓ. శ్రీమతి శారదాదేవి అన్నారు. ఈ తరుణంలో శక్తి స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత శివరామకృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టుపై ఉత్తర్వుల నిచ్చింది. సర్వే నిలిపేయడం వల్ల గిరిజనేతరుల సమస్య పరిష్కారం కనుచూపు మేరలో కనబడడం లేదని గిరిజనేతరులు ఆందోళన చెందుతున్నారు. ఏజన్సీ సమస్య మళ్ళీ మొదటికి రావడానికి ప్రభుత్వ అసమర్థతే కారణమని వారు అంటున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాకు రెండు నెలలుగా ఖాళీగా ఉన్న జిల్లా కలెక్టరు పోస్టును వెంటనే భర్తీ చేయమనడం, గిరిజనులను వేధింపు చర్యలకు గురి చేస్తున్న పోలీసులను బదిలీ చేయమని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం ప్రభుత్వ అసమర్థతని తెలియచేస్తుంది.

**బూసరాజుపల్లి సంఘటన :**

పశ్చిమగోదావరి జిల్లాలో గిరిజనులు తిరుగుబాటు చేసి భూహక్కుకై బాణాలతో ముందుకొచ్చి సంచలనం సృష్టించారు. అంతేగాక రాష్ట్రవ్యాప్తంగా వెలుగులోకి వచ్చిన సంఘటన ఇదే.

1959 చట్టం వచ్చేంతవరకు గిరిజన ప్రాంతాలలో నివసించే దళితులు ఎస్.టి.లుగా చెలామణి అయ్యేవారు. 1959 తరువాత అప్పటివరకు గిరిజనులుగా వున్న దళితులు గిరిజనేతరులుగా మారిపోయారు. దాంతో బుట్టాయిగూడెంకు చెందిన సుమారు 30 మంది ఎస్.సి.లు బూపరాజుపల్లి దగ్గరలోవున్న గయ్యాళు భూమి (ఎ.డబ్ల్యు.డి) 35 ఎకరాలను సాగులోకి తెచ్చుకొని సాగు చేసుకుంటున్నారు. 1967లో తహసిల్దార్ పార్థసారథి, ఎస్.సీ.లకు 'డి' నమూనా పట్టాలిచ్చారని మానుకొండ శాంసన్ (60) చెప్పారు. ఇతనికి ఆ భూమిలో 90 సెంట్ల భూమి ఉంది.



బూసరాజుపల్లి, బుట్టాయగూడెం మండలం

1995లో పశ్చిమగోదావరి జిల్లా గిరిజన గ్రామాలల్లో శక్తి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రవేశించింది. గిరిజనుల చేత పొదుపు చేయించి ఆ సొమ్మును బ్యాంకుల్లో కట్టించడమూ, ఆ సొమ్ములో నుంచి అప్పులు తెచ్చుకోవడం నేర్పించారు. వారికి జరుగుతున్న అన్యాయాలను పరిష్కరించుకొనడం కోసం గ్రామాలలో సంఘాలు ఏర్పరచుకున్నారు బూసరాజు పల్లె గ్రామ శక్తి సంఘ కమిటీ అధ్యక్షుడు పైలా వెంకన్న. స్త్రీలను కూడా చైతన్యపరచి కమిటీలో మెంబర్లుగా చేర్పించారు. వారు గ్రామ కార్యక్రమాలు చూడాలి. అంతే కాకుండా ప్రభుత్వ చట్టాల ప్రకారం గిరిజన భూములన్నీ గిరిజనులవే అనే విషయాన్ని గిరిజనులకు నేర్పారు. అక్కడితో ఆగకుండా గిరిజన సంస్కృతిలోని భాగమైన బాణాలను ఉపయోగించడం మానవద్దని గిరిజనులను ప్రోత్సహించారు.

బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లె గిరిజన గ్రామాలపై 3-8-96న గిరిజనేతరులు కరాటం రాంబాబు అనే భూస్వామి ఆధ్వర్యంలో దాడికి వెళ్ళారు. ఈ వివాదంలో దళితులకు చెందిన భూములను తెరపైకి తెచ్చారు. అయితే ఇరుగుపొరుగు



బూసరాజుపల్లిలో పైడ వెంకయ్య, సంకురమ్మ, ఇతరులు

గిరిజన గ్రామాల నుంచి విషయం తెలుసుకున్న గిరిజనులు బాణాలు ధరించి బూసరాజుపల్లె చేరుకున్నారు. గిరిజనులకు గిరిజనేతరుల మధ్య ఘర్షణలు జరిగి పెద్ద వివాదమయింది. 18 మందికి బాణం దెబ్బలు తగిలాయి. సుమారు 170 మంది గిరిజనులపై పోలీసులు కేసులు పెట్టి రిమాండుకు పంపారు. ఇక్కడ ముఖ్యమైన విషయమేమిటంటే గిరిజనేతరులపై ఒక్క కేసు కూడా పెట్టలేదు. ఈ విషయాన్ని కొవ్వూరు ఆర్.డి.ఓ. శ్రీమతి శారదాదేవి కూడా ధృవీకరించారు. అంతేకాదు, గిరిజనేతరులపై బాణాలు వేసినందుకు, భూస్వామి కరాటం రాంబాబును కొట్టినందుకు నిరసనగా రాంబాబు అనుయాయులు, కాంగ్రెస్ కార్యకర్తలు జంగారెడ్డి గూడెం, జీలుగుమిల్లి యం.ఆర్.ఓ. కార్యాలయ రికార్డులు తగులపెట్టారు. ఈ విషయంలో కూడా విధ్వంసానికి పాల్పడిన గిరిజనేతరులపై పోలీసులు కేసులు పెట్టలేదు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులే ధృవీకరిస్తున్నారు.

**కౌలుదారీ పొలాలు ఆక్రమణ :** పాత కుంకాల, కొత్త కుంకాల, రెడ్డి కుంకాల, పేద్రాల, జిల్లేళ్ళగూడెం, మనుగోపుల గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు రైతు సంఘం ఆధ్వర్యంలో హుకుంపేట జమిందార్‌కు చెందిన సుమారు మూడు వందల ఎకరాల భూమి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు'' అని రైతుకూలి సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్‌తెలిపారు. ఇప్పటివరకూ ఆ గ్రామాలలోని గిరిజనులు తమ ఆధీనంలోని జమిందారు తోటలోని కుంకుళ్ళను దులిపితే సుమారు 50 బస్తాలు అయ్యాయి. వాటిని వారు పంచుకున్నారు. తరువాత జీడిగింజలు కూడా వారి వారి వాటాల ప్రకారం చెట్లను దులుపుకున్నారు. ఇంక కోతకు సిద్ధంగా వున్న మామిడి తోటలు మిగిలాయి. వాటిని కూడా త్వరలోనే దులిపేస్తామని కొత్త కుంకాలకు చెందిన కత్తుల వీరపురెడ్డి అన్నాడు. ఆ తోటల దగ్గరికి వెళ్ళినపుడు జనసంచారం మాత్రం కనబడడం లేదు.

హుకుంపేట, ఎల్.ఎస్.టి. పేట, జిల్లెళ్ళమూడి దగ్గర ఉన్న జమిందారు భూములను చాలా సులభంగా గుర్తించవచ్చు. ఆ పొలాలు, తోటల చుట్టూ ఇనుప ఫెన్సింగ్ ఉంటుంది. ఆ పొలాలకి చుట్టూ వేసిన ఇనుప ఫెన్సింగ్‌కు అయిన ఖర్చుతో ఓ పెద్ద తరహా నీటి ప్రాజక్టు కట్టవచ్చు. కొన్ని చోట్ల అయితే కిలోమీటర్ల కొద్ది ప్రయాణించినా ఇనుప కంచె అంతం కాదు. ఈ జమిందారు కుటుంబాలకు అయిదు ఫర్మ్‌లున్నాయి. వాటి పేర సుమారు 3,500 ఎకరాలు ఉంటే అందులో గిరిజన షెడ్యూలు ప్రదేశంలో 1500 ఎకరాలు ఉందని గిరిజన, గిరిజనేతర పేదల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు.

కొత్త కుంకాల, రెడ్డికుంకాల, జిల్లెళ్ళమూడి ప్రాంతంలో గిరిజనులు స్వాధీనం చేసుకున్నది 250 ఎకరాలేనని రాంపండు ,జమిందార్ అన్నారు. గిరిజనుడు ఒక్కడూ లేని లక్ష్మీ నారాయణ దేవి పేటరోడ్డు కిరుపక్కలా అమెరికాలో వున్న మా ఇద్దరి సోదరుల, మిగిలిన కుటుంబ సభ్యుల భూములు రెండువందల ఎకరాలు ఉన్నాయని అన్నారు. జరుగుతున్న విషయాలపై కేసులు పెట్టినా పోలీసులు స్పందించడం లేదని, అందువల్ల తామే 'సైన్యాన్ని' తయారుచేసుకోవాల్సి వస్తోందని ఎంతో ఆవేదనతో వివరించారు.

# చట్టాలున్నాయి - అమలెవరు చేస్తారు ?

గిరిజనులను మైదానప్రాంతం వారు దోపిడీ చేయడం 1830 నాటికి తీవ్రస్థాయికి చేరుకొంది. అందుకని విశాఖపట్టణం, గంజాం జిల్లాలలో గిరిజన ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించడానికి 'జార్జి రుసెల్'ను బ్రిటిష్ ప్రభుత్వం నియమించింది. గిరిజన సంప్రదాయాలు, గతం నుంచి కొనసాగుతున్న ఆచారాలకు భిన్నంగా, బ్రిటిష్ ప్రభుత్వం లేక జమిందారులు ప్రవేశపెట్టిన చట్టాలు అశాంతికి, కల్లోలానికి కారణంగా పేర్కొని, ఈ ప్రాంతాలను సాధారణ చట్టాల నుండి మినహాయించి జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో ఉంచాలని 'రుసెల్' సిఫారసులు చేశాడు. ఫలితంగా 1839లో విశాఖ, గంజాం జిల్లాలకు ప్రత్యేక చట్టం చేయబడింది. బ్రిటిష్ పరిపాలన క్రింద ఉన్న గిరిజన ప్రాంతాలను ఇతర ప్రాంతాల నుంచి మినహాయిస్తూ 1874లో షెడ్యూల్ల జిల్లాల చట్టం చేశారు.

భూవరాయికరణను నిరోధించి వడ్డీ వ్యాపారులు తీవ్రమైన దోపిడీ నుంచి గిరిజనులను రక్షించడానికి 1917లో ఏజన్సీ ప్రాంతాల భూబదలాయింపు చట్టం అమల్లోకి తెచ్చారు. ఇది గిరిజనుల ప్రయోజనాలు కాపాడడానికి బ్రిటిష్ ప్రభుత్వం చేసిన మొదటి సమగ్రచట్టం. ఇది గిరిజనుల స్థిరాస్తులు ఏవిధంగా కూడా గిరిజనేతరులు పొందడాన్ని నిషేధిస్తోంది. గిరిజనులు నివసించే ప్రాంతాలను "మినహాయింపబడిన ప్రాంతాలుగా" 1936లో ప్రకటించారు. 1959లో షెడ్యూల్ల ప్రాంతాల భూబదిలీ నిబంధనలు చేసేవరకు పై చట్టమే ఆంధ్రాలో అమల్లో వుంది. 'ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు ప్రాంతాల భూబదిలీ నిబంధనలు - 1959' గిరిజన ప్రయోజనాలు కాపాడడానికి చేయబడిన ముఖ్యమైన చట్టం. దీనిని 1963లో తెలంగాణా ప్రాంతానికి విస్తరించారు.

1 ఆఫ్ 1970 నిబంధనలలో ముఖ్యాంశాలు : గిరిజన భూములు, స్థిరాస్తులు గిరిజనేతరులకు బదలాయించడాన్ని పూర్తిగా నిషేధించింది.

గిరిజనేతరుల మధ్య భూమి, స్థిరాస్తుల బదలాయింపును నిషేధించింది. అనగా గిరిజనేతరులు తమ పట్టా భూములు గిరిజనేతరులకు అమ్మితే చెల్లవు. వారు అమ్మదలచుకుంటే గిరిజనులకే అమ్మాలి. గిరిజనులలో ఎవరూ కొనేవారు లేనట్లయితే ప్రభుత్వానికి అమ్మాలి. ప్రభుత్వం 1961 భూగరిష్ట పరిమితి చట్టం ప్రకారం ధర చెల్లిస్తుంది. గిరిజనేతరులు తమ పట్టా భూములు గిరిజనేతరులకు అమ్మితే అది చట్ట వ్యతిరేకం. అటువంటి భూములను ప్రభుత్వం స్వాధీనపర్చుకొంటుంది.



రాంపండు

జమిందారు తోటల్లో వేపచెట్లు నరికినందుకు ఎల్.ఎన్.డి. పేట అధ్యక్షులు అరగటం చిన్నబ్బాయి, కవాటం ఎర్రయ్య, తోకల లక్ష్మయ్య, కలుం గంగరాజులను పోలీసులు అరెస్టు చేశారు. వారే చెట్లు నరికినట్లు సాక్ష్యాలు లేక పోవడంతో విడిచిపెట్టి వెంటనే జీడిగింజలు అక్రమంగా కోశారని మరొక కేసు పెట్టి అరెస్టు చేస్తే, మే రెండవ తేదీని బెయిల్ మీద బయటకు వచ్చారు.

గత సంవత్సరం హుకుంపేట జమిందార్ కుమారుడు రాంపండు తదితరులు దాడి చేసి గిరిజనులను తీవ్రంగా గాయపర్చారు. ఈ దాడికి నిరసనగా ఏజన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నుమారు వెయ్యిమంది గిరిజనులు పోలవరం ఎం.ఆర్.ఓ. ఆఫీసు దగ్గర ధర్నా చేసి, ఎన్.సి., ఎన్.టి. హత్యాచార నిరోధకచట్టం కింద హుకుంపేట జమిందార్ కుమారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఆ పని తమది కాదు పోలీసులది అని ఎం.ఆర్.ఒ. నిరాకరించాడు.

**ప్రభుత్వ అధికారుల అలసత్వం :**

ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వెంటనే జీతం కోసం ఉద్యోగం అనే విషయం రెండవస్థానంకు వెళ్ళిపోతుంది. ఏ పని చేసినా తన కేమిటి లాభం అని ఆలోచించే స్థాయికి చాలా ఎక్కువమంది చేరుకుంటారు. ఈ స్థాయిలో ఉద్యోగులకు గిరిజనుల కంటే గిరిజనేతరులే ముఖ్యం. అందుకు ఉదాహరణలు కోకొల్లలు. తూర్పు గోదావరి జిల్లా ఏజన్సీలో కాపులను కొండకాపులుగా చేసి గిరిజనులుగా గుర్తించారు. అంతే గాకుండా వారికి గిరిజన రైతు వారి పట్టాలను కూడా ఇచ్చారు. ఏదో పాటాల తగాదాలో ఆ విషయం బయటపడింది. తప్పనిసరి పరిస్థితుల్లో 375 మంది కొండకాపుల 'కొండ'లను రద్దు చేశారు. అదే పద్ధతిలో పశ్చిమ గోదావరి జిల్లాలో కూడా ప్రభుత్వాధికారుల అండదండలతో గిరిజనుల భూములను పట్టాల పేరుతో గిరిజనేతరులే అనుభవిస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో గిరిజన భూముల వివాదంలో సుమారు 9000 ఎకరాలు విషయంలో తీర్పులు గిరిజనులకు అనుకూలంగా వచ్చాయి. అయితే రెవెన్యూ శాఖ చాలా చాక చక్యంగా ఈ భూములను గిరిజనులకు ఇవ్వకుండా గిరిజనేతరుల అందుబాటులో వుంచి అక్రమ సంపాదనకు రాచబాటలు వేసుకొంది. శక్తి సంస్థ రికార్డులు పరిశీలించి జరుగుతున్న అక్రమాలను గిరిజనులకు వివరించడం ద్వారా కంటితుడుపుగా మూడువేల ఎకరాలను గిరిజనులకు స్వాధీనం చేశారు.


రాష్ట్రంలోని 'తొమ్మిది సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల్లో అతి చిన్న సంస్థ పశ్చిమగోదావరిది. ఇందులో మూడు మండలాలలోని నూటరెండు గ్రామాలున్నాయి.

**ఆర్థిక దోపిడీతో పాటు సామాజిక దోపిడీ:**

ఆంత్రోపాలజీ సర్వే ప్రకారం 1905లో పశ్చిమగోదావరి జిల్లా ఏజెన్సీ మండలాల్లో గిరిజనులు 90శాతం మంది వుంటే గిరిజనేతర్లు 10 శాతం మాత్రమే ఉండేవారు. 1996 వచ్చేసరికి గిరిజన జాతులు 40 శాతానికి పడిపోయాయి.


## ఏజెన్సీలోని ముఖ్య సంఘటనల వివరాలు

- అగస్టు 5న బూసరాజుపల్లిలో గిరిజన-గిరిజనేతరుల మధ్య ఘర్షణ 10 మందికి గాయాలు
- డిశంబరు 19న గడ్డిగణపవరంలో డి.ఎస్.పితో సహా 50 మంది పోలీసుల నిర్బంధం
- ఏప్రిల్ 11న రెడ్డినాగంపాలెంలో బాణాలతో దాడి
- మార్చి 4న కలెక్టరు రామకృష్ణ బదిలీ
- ఇన్‌చార్జి కలెక్టరుగా సుబ్రహ్మణ్యం చార్జితీసుకున్న 24 గంటల్లోనే అరెస్టులు ప్రారంభం.
- 50 మంది గిరిజనుల అరెస్టు మార్చి 5వ తేదీన మార్చి 18న రెడ్డిగణపవరంలో పోలీసులపై గిరిజనుల దాడి.
- మార్చిలో చురుగ్గా సర్వే జరిగింది. ఏప్రిల్‌లో కొద్దిరోజులు సర్వే జరిగింది.
- ఏజెన్సీలో గిరిజనేతరులకు ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు పలుకుతున్నాయి.
- సి.పి.ఎం.శక్తి గ్రూపు వారు మాత్రం గిరిజనులకు మద్దతు పలుకుతున్నారు.
- ఎస్.టి.అయిన శాసనసభ్యుడు సింగన్న దొర గిరిజనేతరుల తరపున ఉంటున్నారు. ఆయన ఇరువర్గాల విశ్వాసం కోల్పోయారు.
- ఏజెన్సీలో రెండు సంవత్సరాలుగా ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి.
- మూడేళ్ళ క్రితం ఏజెన్సీపై దృష్టి పెట్టిన శక్తి సంస్థ అనతి కాలంలో గిరిజనులను ఉద్యమ పథంపై నడిపింది.
- ఈ ఏడాది పంటలలో దాదాపు 20 శాతం గిరిజనులు పాడు చేశారు, 10 శాతం అపహరించారు.



కొత్తకుంకలకు చెందిన కత్తుల వీరావురెడ్డి కలుం గంగరాజు

1960 దశాబ్దం తరువాత గిరిజనేతరుల వలస తీవ్రత తగ్గింది. గిరిజనభూముల పాతపద్ధతులలో కాకుండా కొత్త పద్ధతిలో కొనసాగింది. కౌలు తనఖా పద్ధతిని విడిచిపెట్టి గిరిజనస్త్రీలను ఉంపుడుగత్తెలుగా తీసుకొని వారి పేరనున్న భూములు పొందటం. తమ చెప్పుచేతల్లో ఉండే గిరిజనుల పేరిట బినామీ భూములుంచడం. పేరుకు తమ పిల్లలను గిరిజనులకు దత్తత ఇచ్చినట్లు రాయించి భూములు



వడగళ్ళ వర్షంవల్ల చెట్లనుంచి రాలిన జీడీమామిడి కాయలు

అనుభవించడం జరుగుతుండేది. గిరిజనులలో స్త్రీలు బానిసలు కారు. వారి ఇష్టమైన వారిని వివాహమాడవచ్చు. వెయ్యి నుండి మూడు వేలరూపాయల వరకు 'తప్పు కట్టి'నవారికి ఏ గిరిజన అమ్మాయినైనా తీసుకొనే (ఉంచుకొనే) హక్కు లభిస్తుంది.

జీలుగుమిల్లి మండలంలో గిరిజనులు 25 శాతం, గిరిజనేతరులు 75 శాతం ఉండడం వల్ల, ఈ మండలంలోని పదమూడు గ్రామాలను గిరిజనేతర గ్రామాలుగా ప్రకటించాలని 1989లో పదమూడు కేసులు హైకోర్టులో నమోదు అయ్యాయి. అంతెందుకు పశ్చిమగోదావరి జిల్లా గిరిజన షెడ్యూలు ప్రాంతంలో వున్న భూమి 75,702.42 ఎకరాలు. అందులో గిరిజనేతరుల ఆధీనంలో 35,169.15 ఎకరాలు వున్నది. ఇందులో అధికభాగం చెరువుల కిందా,సాగునీరు లభించే ప్రాంతాలలో ఉండడం గమనార్హం.

**ఆహారసేకరణ నుండి ఆస్తి హక్కు నము పార్దనవైపు :**

మోళ్ళు పీకి, పోడు గట్టిన గిరిజనులు ఇప్పుడు కూలీలుగా 'బతుకు లీడుస్తున్నారు. మైదాన ప్రాంతాలలో దివాలా తీసి ఏజన్సీకి పొట్టచేత పట్టుకొచ్చిన గిరిజనేతర్లు ఏకులు మేకులయ్యారు. గిరిజనులను మోసగించి భూస్వాములూ వారి కళ్ల ఎదుటే కుబేరులై పెత్తనం చెలాయించడం చైతన్య వంతమైన గిరిజన యువ తరం, మహిళలూ అంగీక రించడం లేదు. శక్తి స్వచ్ఛంద సేవా సంస్థ అధి నేత శివరామకృష్ణ మాటల్లో చెప్పాలంటే "మా సంస్థ చేసింది అతి తక్కువ అయినా ప్రభావం మాత్రం చాలా వచ్చింది. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న విషయాన్ని జిరాక్స్ కాపీలు తీసి గిరిజను లకు చూపించాం. గిరిజన భూముల అడంగళ్ళు రహస్యస్థావర డాక్యు మెంట్లు కాదు గదా? రెండూ గిరిజన సంస్కృతిలో భాగం వేటాడ్డం. అడవిలోని క్రూరమృగాల నుంచి ఆత్మరక్షణ చేసు కోవడానికి బాణాలు ఉపయోగించడం.

పశ్చిమగోదావరి షెడ్యూలు గిరిజన ప్రాంతంలో ఇప్పుడు అడవుల్లేవు. అంతా కొండలు, రాళ్ళు మాత్రమే కనపడు తున్నాయి. మిగి లిన ఒకటి అరా చెట్లు కూడా నరికి అమ్మేసుకుంటున్నారు. ఏ గ్రామాన్ని పలకరించినా ఎండ వేడిమితో పాటు వారికి జరిగిన అన్యాయాలకు ఉడికిపోతున్నారు. ఎవరూ మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. యుద్ధం ముందు ప్రశాంత వాతావరణంలా ఉంది. వేసవి కాలంలో విరబూసే ఫైర్ అఫ్ ది ఫారెస్టు చెట్లు మాత్రం గ్రామానికి ఒకటో రెండో చాలీ చాలని నీడ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాయి.

గిరిజనులు ఆహార సేకరణ నుండి ఈ భూమి మాది, ఈ గాలి మాది అనే ఆస్తి హక్కు వైపు ఈ ఉద్యమం తీసుకెళుతుంది. ఇది గిరిజనుల చేత వ్యవసాయం చేయిన్తుంది. వ్యవసాయంలో మెలకువలు నేర్పుతుంది. అనేక బాధలు బాధ్యతల మధ్య గిరిజనుడు రైతుగా అవతరిస్తాడు.

- కెమెరా విజయకుమార్